AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in


### ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు

**అక్షరటుడే, ఇందూరు:** ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత సీఎం, మాజీ సీఎం మధ్య ఏదో లాలూచీ నడుస్తోందని అనుమానం వ్యక్తం చేశారు. ఆదివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద తనను కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. ఎంతో కీలకమైన కాళేశ్వరంపై చర్చ సందర్భంగా రేవంత్‌రెడ్డి కేరళ పర్యటనకు వెళ్లడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పంపించిన వ్యక్తితో రహస్య ఒప్పందం కుదుర్చుకోవడానికే కేరళకు వెళ్లారని ఆరోపించారు. కీలకమైన కాళేశ్వరం నివేదికపై అసెంబ్లీలో చర్చ జరుగుతున్న వేళ రేవంత్‌రెడ్డి కేరళ పర్యటనకు వెళ్లడం వెనక మతలబు ఏమిటని రాకేశ్‌రెడ్డి ప్రశ్నించారు.




నగరంలోని నిఖిల్‌సాయి చౌరస్తా వద్ద గుంతలమయంగా మారిన రోడ్డు

పట్టణాలపై దృష్టి సారించిన ప్రభుత్వం ప్రక్షాళన దిశగా చర్యలు చేపట్టింది. ప్రజారోగ్యం, పారిశుధ్యంపై దృష్టి పెట్టడంతో పాటు అంతర్గత రోడ్లలో ప్యాచ్ వర్క్‌లు తదితర పనులపై వంద రోజుల యాక్షన్ ప్లాన్‌కు శ్రీకారం చుట్టింది. జూన్ 2న కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించింది. కానీ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం క్షేత్రస్థాయిలో నెరవేరడం లేదు. కార్యక్రమం పూర్తిస్థాయిలో అమలుకాక పోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

- అక్షరటుడే, ఇందూరు



# 100 రోజుల పేరు..
# మారని తీరు

▸ పూర్తిస్థాయిలో అమలు కాని యాక్షన్‌ప్లాన్ ▸ గుంతల రోడ్లతో అవస్థలు ▸ పారిశుధ్య పనుల నిర్వహణ అంతంతే.. ▸ నెరవేరని ప్రభుత్వ లక్ష్యం


వందరోజుల ప్రణాళిక పేరుతో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో జూన్ 2న పలు కార్యక్రమాలను ప్రారంభించారు. ఇది సెప్టెంబర్ 10వ తేదీ వరకు కొనసాగనుంది. క్షేత్రస్థాయిలో రోజుకో కార్యక్రమాన్ని చేపట్టి కార్యాచరణను అమలు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంతవరకు బాగానే ఉన్నా.. నిధుల కొరత, ఆయా విభాగాల మధ్య సమన్వయం లేకపోవడం, ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనబడుతోంది.

"ఒక మార్పు..అభివృద్ధికి మలుపు" అనే నినాదంతో రోజుకో కార్యక్రమం చేపట్టాలి. ఇందులో మహిళా సంఘాలు, సామాజిక, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలను భాగస్వాములను చేయాలి. కానీ నగరంలో ఎక్కడా కూడా ఇలాంటి పరిస్థితి కనబడటం లేదు. నగరపాలక సంస్థ కార్మికులతో డ్రెయినేజీలు, ఇంటింటి చెత్త సేకరణ, అక్కడక్కడ ప్రతిజ్ఞలు చేయించడం వరకే పరిమితమవుతున్నారు. ఇంటింటి చెత్త సేకరణ కూడా నగరంలోని పలు కాలనీలలో నిత్యం జరగడంలేదని ఆరోపణలు ఉన్నాయి. కార్యక్రమం ప్రారంభమై 90 రోజులు గడుస్తున్నా జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో నామమాత్రంగానే కొనసాగుతోంది.

వందరోజుల ప్రణాళికలో భాగంగా జిల్లా కేంద్రంలోని రోడ్లపై ప్యాచ్ వర్క్‌లు చేశారు. కానీ అది నామమాత్రంగానే కనిపిస్తోంది. నాణ్యత లోపం, నగరం మొత్తం పూర్తిస్థాయిలో చేయకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికీ పలు ప్రాంతాల్లో ఏర్పడిన గుంతల రోడ్లు దర్శనమిస్తున్నాయి. అసలే వర్షాకాలం కావడంతో గుంతలు నీళ్లతో నిండి వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. మిగిలిన 10 రోజులైనా ప్రత్యేక అధికారులు బాధ్యతతో పర్యవేక్షిస్తే కొంతైనా బాగుపడే అవకాశం ఉంది.

**మచ్చుకు కొన్ని..**

- నగరంలోని వినాయక్ నగర్ సబ్ స్టేషన్‌కు వెళ్లే దారిలో పూర్తిగా గుంతలు ఏర్పడడంతో ఇబ్బందులు తప్పడం లేదు.
- జిల్లా కేంద్రంలోని నిఖిల్ సాయి చౌరస్తాలో పూర్తిగా గుంతలు ఉండడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు.
- అనేక కాలనీల్లో పారిశుధ్యం లోపం స్పష్టంగా కనిపిస్తోంది. కొన్ని కాలనీలో కేవలం ఫొటోలకే పరిమితమవుతున్నారు. పూర్తిస్థాయిలో మురికి కాల్వలను శుభ్రం చేయడం లేదు.
- పెద్ద బజార్, బ్రహ్మపురి, గాజులపేట్ కాలనీలలో చెత్త సేకరణ బండి రెండు రోజులకోసారి రావడంతో ఇళ్లలో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి.
- వర్షాకాలం దోమల బెడదను నివారించడానికి రెగ్యులర్‌గా ఫాగింగ్ చేయడం లేదు.



## శ్రీరాంసాగర్‌లోకి కొనసాగుతున్న వరద

**అక్షరటుడే, ఆర్మూర్ :** శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు ఎగువ నుంచి వరద కొనసాగుతోంది. దీంతో 38 గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులోకి వారం రోజులుగా భారీ వరద వస్తోంది. దీంతో అధికారులు దిగువకు నీటి విడుదల పెంచారు. ప్రస్తుతం వర్షాలు, ఎగువ నుంచి వరద ఉధృతి తగ్గడంతో గోదావరిలోకి నీటి విడుదలను తగ్గించారు. దీంతో ప్రాజెక్ట్ నీటిమట్టం పెరుగుతోంది. శ్రీరామ్ సాగర్‌లోకి ప్రస్తుతం 4.50 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. 38 వరద గేట్ల ద్వారా 3.25 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. మొత్తం ఔట్ ఫ్లో 3,56,853 క్యూసెక్కులుగా ఉంది. ప్రస్తుతం జలాశయంలో నీటిమట్టం 67.3 టీఎంసీలకు చేరింది. ఎస్సారెస్పీ నుంచి ఎస్కేప్ గేట్ల ద్వారా 3500 క్యూసెక్యులు, వరద కాలువ కు 18వేలు, కాకతీయ కాలువకు 4,500 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మిషన్ భగీరథకు 231క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 622 క్యూసెక్కుల నీరు పోతోంది.



## భారీ వర్షాలపై ప్రభుత్వం ముందే హెచ్చరించి ఉండాల్సింది

**అక్షరటుడే, కామారెడ్డి:** భారీ వర్షాలపై ప్రభుత్వం ముందే హెచ్చరించి ఉండాల్సిందని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. ప్రభుత్వం ముందే హెచ్చరిస్తే ఇంత నష్టం జరిగేది కాదని అభిప్రాయం వ్యక్తం చేశారు. పట్టణంలోని తన నివాసంలో ఆదివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండుగ పూట కామారెడ్డి నియోజకవర్గంలో వరదలు ప్రళయం సృష్టించాయన్నారు. వరదల ధాటికి ప్రజలు తట్టుకోలేకపోయారని, ఈ నష్టం ఎవరు పూడ్చలేనిదని ఆయన విచారం వ్యక్తం చేశారు. వరదలతో నియోజకవర్గంలో నలుగురు చనిపోయారని తెలిపారు. వరదల సమయంలో బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించలేదని, భోజనం, నీళ్లు కూడా అందించలేదని బాధితులు తెలిపారని గంపగోవర్ధన్ పేర్కొన్నారు. ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క కాలనీలో తూతూమంత్రంగా పర్యటించారని ఆరోపించారు. జీఆర్ కాలనీలో 48 ఇళ్లకు ఒక్కొక్క ఇంటికి రూ.11,500 ఇస్తామని కలెక్టర్ ప్రకటించారని, ఆ సహాయం దేనికి సరిపోతుందో వారే చెప్పాలని ప్రశ్నించారు. ఒక్కో ఇంటికి రూ.లక్ష సహాయం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే చనిపోయిన కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం చొప్పున అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు నల్లవెల్లి అశోక్, కుంబాల రవి, ప్రభాకర్‌రెడ్డి, బలవంత రావు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## వరద బాధితులను ఆదుకుంటాం

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డిలో ప్రజలు వరదలతో అల్లాడుతుంటే బీజేపీ ఏం చేస్తోందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి ప్రశ్నించారు. ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, శంకర్ నాయక్, బల్మూరి వెంకట్‌లతో కలిసి ఆదివారం కామారెడ్డి పట్టణంలో పర్యటించారు. పట్టణంలోని వరద ముంపునకు గురైన జీఆర్ కాలనీ, కౌండిన్య, హౌసింగ్ బోర్డు కాలనీల్లో పర్యటించారు. జీఆర్ కాలనీలో ప్రతి ఇంటికి వెళ్లి బాధితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వరదలకు గల కారణాలపై ఆరా తీశారు. వరదతో తీవ్రంగా నష్టపోయామని బాధిత కుటుంబాలు ఎమ్మెల్సీల బృందం ముందు కన్నీటి పర్యంతమయ్యాయి.వరదల్లో సర్వం కోల్పోయామని, ప్రాణాలతో బయట పడ్డామని చెప్పుకున్నారు. వరదల సమయంలో దాబాలు, ట్యాంకులపై ఎక్కి ప్రాణాలు కాపాడుకున్నామని ఆవేదన వెలిబుచ్చారు. ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం ఆదుకుంటుందని విజయశాంతి బాధిత కుటుంబాలను ఓదార్చారు. జీఆర్ కాలనీలో దాదాపు రెండు గంటల పాటు విజయశాంతి పర్యటించారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను వరద నష్టం వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అందిస్తున్న వసతులు, సహాయంపై ఆరా తీశారు. అనంతరం పార్టీ జిల్లా

**▪వరదలతో ప్రజలు అల్లాడుతుంటే బీజేపీ ఏం చేస్తోంది**
**▪ఎమ్మెల్సీ విజయశాంతి**

కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. వరదలతో ఇబ్బంది పడ్డ ఒక్కో ఆడబిడ్డ వారి పరిస్థితి చెబుతుంటే ఏం మాట్లాడాలో అర్థం కాలేదన్నారు. కాలనీ వాసుల పరిస్థితి చూసి కన్నీళ్లు వచ్చాయన్నారు. ఈ పరిణామం ఎవరూ ఊహించనిదని పేర్కొన్నారు. ప్రజల బాధ కళ్లారా చూశాక వారు అనుకున్న దానికన్నా ఎక్కువే ప్రభుత్వం ఇచ్చేలా చూస్తామన్నారు. ప్రజలు ఇంతలా అల్లాడుతుంటే బీజేపీ ఏం చేస్తోందని విజయశాంతి ప్రశ్నించారు. తెలంగాణలో 8 మంది ఎమ్మెల్యేలు, 8 మంది ఎంపీలను ఇక్కడి ప్రజలు గెలిపించారని గుర్తు చేశారు. ఇలాంటి సమయంలో కేంద్రమే ముందుకు వచ్చి నష్టపరిహారం ఇస్తామని చెప్పాల్సిందని విజయశాంతి పేర్కొన్నారు. బఫర్ జోన్‌పై విలేకరులు ప్రశ్నించగా గతంలో చేసిన తప్పుల వల్లే ఇళ్లలోకి నీళ్లు వచ్చాయన్నారు. మళ్లీ ఇలాంటివి జరగకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటుందని తెలిపారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్ కామారెడ్డిలో ఇలాంటి ఘటన జరగడం బాధాకరమని, ఇక్కడి పరిస్థితులను పరిశీలించి



నష్టంపై ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడం కోసమే తాము వచ్చామన్నారు. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ వరదల్లో ఇబ్బందులకు గురైన ఎమ్మెల్యే ప్రజలకు భరోసా ఇవ్వాల్సింది పోయి ప్రజలనే తప్పు పడతారా అని ప్రశ్నించారు. ప్రజలను తప్పుపట్టేలా ఎమ్మెల్యే వ్యాఖ్యలు సరికావని పేర్కొన్నారు. ఆ వ్యాఖ్యలు వెనక్కి తీసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ కామారెడ్డి వరద ఘటనపై ఛైర్మన్ అనుమతి తీసుకుని శాసన మండలిలో ప్రత్యేకంగా చర్చిస్తామని తెలిపారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ రావు, టీపీసీసీ జనరల్ సెక్రెటరీలు గిరిజ షెట్కార్, ఉప్పల శ్రీనివాస్ గుప్తా, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ చంద్రకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకులు నోరు అదుపులో ఉంచుకోవాలి



**అక్షరటుడే, ఇందూరు:** కాంగ్రెస్ నాయకులు నోరు అదుపులో ఉంచుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోల్ల లక్ష్మీనారాయణ, న్యాలం రాజు హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ ఎదుట ఆదివారం రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీహార్ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ, ఆమె తల్లిపై రాహుల్ గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. ఓట్ల కోసం బీసీలను కించపరిచినట్లు మాట్లాడటం తగదని ఈ సందర్భంగా బీజేపీ నాయకులు పేర్కొన్నారు. రాష్ట్రంలో పాలన గాలికొదిలేసి ఓట్ల కోసం సీఎం రేవంత్ రెడ్డి బీసీ డ్రామా ఆడుతున్నారని విమర్శించారు. దిష్టిబొమ్మ దహనం చేసే సమయంలో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కాసేపు తోపులాట జరిగింది.

## 'వక్ఫ్ ఆస్తులను బీసీలకు పంచే దమ్ము కాంగ్రెస్‌కు ఉందా..'

**అక్షరటుడే, ఇందూరు:** రాష్ట్రంలోని వక్ఫ్ ఆస్తులను బీసీలకు పంచే దమ్ము కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉందా అని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా ప్రశ్నించారు. శాసనసభలో ప్రవేశపెట్టిన బీసీ రిజర్వేషన్ బిల్లుపై ఎమ్మెల్యే ఆదివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన బీసీ కులగణన లెక్కలు తప్పులతడకగా ఉన్నాయని దుయ్యబట్టారు. ప్రభుత్వం వెల్లడించిన గణాంకాల ప్రకారం హిందూ బీసీలు 46.25 శాతం అని ముస్లిం బీసీలు 10.8 శాతం అని తేల్చి.. ముస్లింలను బీసీల్లో కలిపే ప్రయత్నం చేస్తోందన్నారు. బీసీ రిజర్వేషన్లను ముస్లింలకు పంచిపెట్టే రేవంత్ సర్కారు, ముస్లింల వక్ఫ్ భూములను బీసీలకు పంచాలని డిమాండ్ చేశారు. ఇది బీసీ డిక్లరేషన్ బిల్ కాదని, ముస్లిం రిజర్వేషన్ బిల్




అని వ్యాఖ్యానించారు. మతం ఆధారంగా ఇచ్చే రిజర్వేషన్లను తాము ఎప్పటికీ అంగీకరించబోమని స్పష్టం చేశారు. 42 శాతం మొత్తం రిజర్వేషన్లు బీసీలకే రావాలని డిమాండ్ చేశారు.

## 6న వినాయక నిమజ్జనం.. భారీ విగ్రహాల దారి మళ్లింపు: సీపీ

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్ నగరంలో సెప్టెంబర్ 6న తేదీన గణేష్ నిమజ్జన శోభాయాత్ర ఉంటుందని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా 8 ఫీట్ల కన్నా ఎక్కువ ఎత్తు గల విగ్రహాల నిమజ్జనానికి పోలీసులు సూచించిన నిబంధనలు పాటించాలన్నారు. జాన్కంపేటలో రైల్వే హైటెన్షన్ లైన్ ఉన్నందున.. ఆ రూటులో 8 ఫీట్ల కంటే ఎక్కువ ఎత్తు గల వాహనాలు వెళ్లడం నిషిద్ధమన్నారు. గణేశ్ విగ్రహం 8 ఫీట్లలోపు ఉన్నట్లయితే విగ్రహాలను పాత రూట్ ప్రకారంగా నెహ్రూపార్కు, అర్సపల్లి , జాన్కంపేట్, నవీపేట్ మీదుగా బాసరకు వెళ్లాలన్నారు. 8 ఫీట్ల కన్నా ఎత్తుగల విగ్రహాలను రూటు మార్చడం జరిగిందని పేర్కొన్నారు. గణేశ్ మండలి నిర్వాహకులు తప్పకుండా గమనించాలన్నారు. భారీ



గణేశ్ నిమజ్జనాల రూట్ మ్యాప్ పూర్తిగా పాత నిజామాబాద్ ఏరియా వారు గాజుల పేట శివాజీ నగర్, గోల్ హనుమాన్ , అంగడి బజార్, ఎల్లమ్మ గుట్ట, పూలాంగ్, రాజారాజేంద్ర చౌరస్తా చుట్టు ప్రాంతాలు, సాయినగర్ , గాయత్రి నగర్, కోట గల్లి, హౌసింగ్ బోర్డు, బోర్గాం, న్యాల్‌కల్, నాగారాం మొదలైన ప్రాంతాల వారు పూలాంగ్ - ఎన్టీఆర్ చౌరస్తా - రైల్వే స్టేషన్ - బస్ స్టేషన్ - రైల్వే ఓవర్ బ్రిడ్జి - శివాజీ చౌక్ - దుబ్బా - జీజీ కాలేజీ చౌరస్తా - బైపాస్ రోడ్డు - డీఎస్ చౌరస్తా - ముబారక్ నగర్ - మాణిక్ బండార్ - దాస్ నగర్ - మాక్లూర్ - నందిపేట్ ఉమ్మెడ గ్రామ సరిహద్దులో గల గోదావరి బ్రిడ్జికి వెళ్లవచ్చని పేర్కొన్నారు. గణేశ్ మండళ్ల నిర్వాహకులు, భక్తులు, ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.



# విశేష పూజలందుకుంటున్న విఘ్నేశ్వరుడు

వినాయక చవితి వేడుకలు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కనుల పండువగా సాగుతున్నాయి. వివిధ మండపాల్లో ఏర్పాటు చేసిన గణనాథుడికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. పలు మండపాల్లో విభిన్న రూపాల్లో ప్రతిష్టించిన గణనాథులు ఆకట్టుకుంటున్నాయి. అంతేకాకుండా కొన్నిచోట్ల ఏర్పాటు చేసిన సెట్టింగ్ లు విశేషంగా ఆకర్షిస్తున్నారు. భక్తులు తరలివచ్చి వీక్షిస్తున్నారు. కాగా.. వివిధ గణేశ్ మండళ్ల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అలాగే పలుచోట్ల కుంకుమార్చనలు చేస్తున్నారు.

–అక్షరటుడే, నెట్‌వర్క్




చంద్రశేఖర్ కాలనీలోని శ్రీ సిద్ది వినాయక గణేశ్ మండలి



నందిపేట్ మండలంలోని వెల్మల్ గ్రామంలో..






రైతు బజార్‌లోని సనాతన్ గణేశ్ మండలి



దుబ్బలోని రిద్ది సిద్ది గణేశ్ మండలి




శివాజీ నగర్‌లోని శివపుత్ర గణేశ్ మండలి..



ఆర్మూర్‌లో..




చంద్రశేఖర్ కాలనీలోని భగత్ సేన గణేశ్ మండలి..




దుబ్బ లోని శ్రీజవహర్ కిసాన్ గణేశ్‌మండలి..



శ్రీ ముదిరాజ్ గణేశ్ భజన మందిర్..



బురుడిగల్లిలో మేదరి సంఘం గణేశ్ మండలి




ఆర్ఆర్ చౌరస్తాలోని చైతన్య యూత్ ఆధ్వర్యంలో..



ఇజ్రాయిల్‌లో గణేశ్ చవితి ఉత్సవాలు..



నందిపేటలో నవసేన యూత్ గణేశ్ మండలి..



నగరంలోని శ్రీనవయువ మరాఠా గణేశ్ మండలిలో..



హమాల్‌వాడిలోని గాంధీ గణేశ్ మండలి



అంబేద్కర్ కాలనీలోని శ్రీ గణేశ్ మండలి



సుభాష్‌నగర్‌లోని శ్రీ పార్వతిపుత్ర గణేశ్ మండలి



హమాల్‌వాడిలోని హరిహర గణేశ్ మండలి



రావూజీ వంజరి సంఘంలో నవ యువక్ గణేశ్ మండలి..



నగరంలోని శ్రీరాం యువసేన గణేశ్ మండలిలో..



బాన్సువాడ పట్టణంలో పూజలు



ఆర్మూర్‌లోని వరల్డ్ యూత్ గణేష్ మండలి..



ఆర్మూర్ పట్టణంలో కుంకుమార్చనలు

## వరద బాధితులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సాయం



**అక్షరటుడే,బోధన్:** భారీవర్షాలతో మంజీర నదికి భారీ వరద వచ్చి చేరడంతో హున్సా, మందర్న గ్రామాలు నీట మునిగాయి. దీంతో మందర్నలో సుమారు 70 నుంచి 80 ఇళ్లలోకి నీరు చేరింది. కాగా.. నిరాశ్రయులైన బాధితులకు లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆచన్‌పల్లి ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రతినిధులు ఇల్తెం శంకర్ మాట్లాడుతూ వరద వల్ల చాలా కుటుంబాలు కనీసం నిత్యావసర వస్తువులు పనికి రాకుండా పోయాయామని.. మా వంతు సాయంగా బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు బస్వేశ్వర్, చక్రపాణి, రాజు గ్రామస్థులు రవి, గంగాధర్ పాల్గొన్నారు.

## బీజేవైఎం నాయకుల ముందస్తు అరెస్ట్

**అక్షరటుడే, ఆర్మూర్:** మండలకేంద్రంలో బీజేపీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్నారనే సమాచారంతో నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేశారు. అనంతరం వారిని నందిపేట్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బీహార్‌లో గాంధీ ప్రధాని మోదీ తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా బీజేపీ నాయకులు రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు యత్నించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అరెస్టులతో పోరు ఆగదన్నారు. అరెస్ట్ అయిన వారిలో బీజేవైఎం డొంకేశ్వర్ మండల అధ్యక్షుడు గజ్జల సతీష్ కుమార్ తదితరులున్నారు.

## అక్టోబర్‌లో బీఎల్‌టీయూ మహాసభలు



**అక్షరటుడే, ఇందూరు:** తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం, బీఎల్‌టీయూ ఆధ్వర్యంలో నగరంలో మహాసభలు నిర్వహించనున్నట్లు బీడీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధిరాములు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం సంఘం కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. అక్టోబర్ 11, 12 తేదీల్లో నగరంలో పాత కలెక్టరేట్ గ్రౌండ్ లో మహాసభల్లో భాగంగా భారీ బహిరంగ సభ ఉంటుందని వివరించారు. అంతకంటే ముందుగా తిలక్‌గార్డెన్ నుంచి భారీ ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. 12న న్యూ అంబేడ్కర్ భవన్‌లో ప్రతినిధుల మహాసభ నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

## కరెంట్ షాక్‌తో పెయింటర్ మృతి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. ఇళ్ల మీద నుంచి కరెంట్ తీగలు వెళ్తుండడంతో ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. నిజామాబాద్ నగరంలోని ఐదో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల సీతారాం నగర్ కాలనీలో ఓ పెయింటర్ విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. కాలనీలో ఓ వ్యక్తి ఇంటి నిర్మాణం చేపడుతున్నాడు. కాగా.. మహారాష్ట్ర నుంచి వలస వచ్చిన నాందేవ్ (45) ఆ ఇంటికి పెయింటింగ్ వేయడానికి వచ్చాడు. అయితే ఇంటిపైన విద్యుత్ తీగలు ఉన్నాయి. ఈ క్రమంలో నాందేవ్ ప్రమాదవశాత్తు వాటికి తాకడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై గంగాధర్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## శరవేగంగా రోడ్ల మరమ్మతు పనులు

**అక్షరటుడే, బాన్సువాడ:** వర్ని మండలం కూనీపూర్ వెంకటేశ్వర క్యాంప్‌లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లు తెగిపోయాయి. దీంతో మాజీ డీసీసీబీ ఛైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే పోచారం ఆదేశాల మేరకు పోచారం భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో కునీపూర్ కాంగ్రెస్ నాయకులు రంగంలోకి దిగారు. పీసీసీ డెలిగేట్ డాక్టర్ కూనీపూర్ రాజారెడ్డి, సొసైటీ మాజీ ఛైర్మన్ కృష్ణారెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి పర్యవేక్షణలో మరమ్మతు పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. మరమ్మతులు పూర్తయితే జాకోరా, జలాల్‌పూర్ మధ్య రాకపోకలు ప్రారంభం కానున్నాయి.

